పార్టీ కోసం బాధ్యతగా పనిచేయండి

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


దువ్వూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దీవాన్స్ కల్యాణ మండపంలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు సంతృప్తికరంగా అందాయని తెలిపారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లపై ఉందని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పథకాలను వివరించాలని సూచించారు. పథకాలు రాని వారి వివరాలను సచివాలయ సిబ్బందికి అందించి ప్రజలకు లబ్ధి చేకూర్చాలని తెలిపారు. రైతులకు రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు వడ్డీ మాఫీ తదితర పథకాలను అందించామన్నారు. 2014లో చంద్రబాబునాయుడు అన్ని వర్గాలను మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేసీ కెనాల్, తెలుగుగంగకు నీరు ఎప్పుడు వచ్చేది తెలియదని, పంటలు సాగు చేసేందుకు నీటి కోసం ధర్నాలు నిర్వహించామని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రెండో పంటను పండించేందుకు కూడా నీరు పుష్కలంగా ఉందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాలన్నింటిని ప్రజలకు వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు వివరించి సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండుగ అన్నారని ఎద్దేవ చేశారు. నేడు ముఖ్యమంత్రి వ్యవసాయం దండుగ కాదని, పండుగ అని నిరూపించారన్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిశీలకుడు యల్లారెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు క్రమశిక్షణతో పనిచేసి 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ దండు చెంద్రాయుడు, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథులకు నేడు శిక్షణ

మైదుకూరు : జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం మైదుకూరులో బుధవారం నిర్వహించనున్నారు. పట్టణంలో ఎస్‌సీఆర్ కల్యాణ మండపంలో మున్సిపాలిటీ, మండల పరిధిలోని కన్వీనర్లు, గృహ సారథులకు ఉదయం 9.30 గంటలకు ఈ శిక్షణ ప్రారంభమవుతుంది. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుంది.

రేపు బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు గురువారం ఉదయం 11 గంటలకు బి.మఠంలోని యోగి వేమారెడ్డి నిత్యాన్నదాన సత్రంలో శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

రేపు బి.మఠంలో గడప గడపకు మన ప్రభుత్వం

మండలకేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని గ్రామ సచివాలయం 3 పరిధిలో గురువారం ఉదయం 6గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ, ఎంపీడీఓలు సంయుక్తంగా తెలిపారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పకుండా పాల్గొనాలని తెలిపారు.

టీడీపీ నాయకులకు సైతం సంక్షేమం

చాపాడు : ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వందేని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరికీ మంచి చేయాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కర్నాటి నారాయణరెడ్డి, శాంతు రాజు, చాపాడు సర్పంచ్‌లు మహబూబ్, శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతాన లక్ష్మి అలంకారంలో పెద్దమ్మ తల్లి



మైదుకూరు : గ్రామ దేవత శ్రీపెద్దమ్మతల్లి 24వ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం పెద్దమ్మతల్లి సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలని వినతి

బద్వేలు అర్బన్ : దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దారు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా అంబేడ్కర్ రాజ్యాధికార సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎం.పిచ్చయ్య, సామాజిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఓఎస్‌పీ ప్రసాద్‌లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దళితుల ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

సేవాశ్రమానికి విద్యార్థుల వితరణ


ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న రామకృష్ణ

కాశినాయన : మండలంలోని ఓబులాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమానికి పోరుమామిళ్లలోని వైష్ణవి ఆంగ్లపాఠశాల విద్యార్థులు, కరస్పాండెంట్ డాక్టర్ ఆర్వీ రామకృష్ణలు మంగళవారం రూ.30 వేల నగదు, రెండు నెలలకు సరిపడ నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని బైపాస్‌రోడ్డు సమీపంలోని ఓ ఇంటిలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 245 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. డీటీకి వచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఆయన స్థానిక బైపాస్‌రోడ్డుకు సమీపంలోని కింగ్‌ప్లాజా హోటల్ వెనుక భాగంలోని ఓ ఇంటిని తనిఖీ చేయగా అందులో నిల్వ ఉంచిన 11,025 కిలోల 245 బస్తాల రేషన్ బియ్యాన్ని, ఆల్విన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వెంకటేశ్వర్లుతో పాటు ఆల్విన్ యజమాని అబ్దుల్ సత్తార్, డ్రైవర్ ఇమాంబాషాలపై అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నువ్వుల విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలను అందిస్తున్న శాస్త్రవేత్తలు

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతులకు నువ్వుల విత్తనాలను పంపిణీ చేశారు. ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా జేసీఎస్-1020 రకం నువ్వుల పంటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త హర్షిత మాట్లాడుతూ ఈ రకం నువ్వులు వేసవికి అనువుగా ఉంటాయని తెలిపారు. దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలకు చెందిన రైతులకు నువ్వుల విత్తనాలు అందించారు. కేవీకే శాస్త్రవేత్తలు ఫిరోజ్ హుస్సేన్, కాంతిశ్రీ పాల్గొన్నారు.

గాయని వాణి జయరాంకు నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మహేష్ ఆర్ట్స్ గ్యాలరీలో ప్రముఖ గాయకురాలు వాణి జయరాంకు మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలపాటు తన మధుర స్వరంతో వాణి జయరాం ప్రజలను అలరించారని, ఆమె మరణం తీరని లోటని తెలిపారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిత్రకారుడు రామాంజనేయులు, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, గాయకులు ప్రభు, బాలగంగాధర్, రంగస్థల నటుడు చంద్రశేఖర్ రాజు, ప్రసన్న, శివకళ్యాణి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన డ్రైవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో రూ.250లతో అర్హులైన బాలికలకు సుకన్య సమృద్ధి యోజన డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో అమృత్ పెక్స్ ప్లస్-2023ను పురస్కరించుకుని ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

10 ఉచిత కంటివైద్య శిబిరం

పోరుమామిళ్ల : ఈనెల 10న శుక్రవారం పోరుమామిళ్ల పంచాయతీ కార్యాలయంలో నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్, జనరల్ ఆసుపత్రి వైద్యసిబ్బందిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జి ఆది తెలిపారు. సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. వివరాలకు 9100510326, 9985750735 నెంబర్‌లకు సంప్రదించాలని శిబిర నిర్వాహకులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లె పంచాయతీ చవటపాలెం వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుమందిని సీఐ రమేష్‌రెడ్డి అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మైదుకూరు : ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన అవసరమని అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. మంగళవారం కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని జీవీ సత్రం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అదనపు డీఎంహెచ్ఓ జీవీ సత్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగి వర్ణంలోని మచ్చలున్నా, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకున్నా కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు సుధ, శ్రీనాథ్, హైస్కూల్ హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

గృహ సారథుల శిక్షణలో
ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఎస్పీ జగన్‌మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఎంఆర్ కల్యాణ మండపంలో గృహ సారథులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా, పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అన్ని పార్టీల వారికీ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. నియోజకవర్గంలోని గోపవరం వద్ద రూ.1000 కోట్లతో సెంచూరి ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో తేడాలని ప్రజలకు వివరించాలని సూచించారు. రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ అంకన గురివిరెడ్డి, మాజీ ఎంపీపీ సూదా రామకృష్ణారెడ్డి, ఎంపీపీ నారాయణయాదవ్, మాజీ జడ్పీటీసీ సుదర్శన్, సింగిల్ విండో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సచివాలయ కన్వీనర్లు మండల కన్వీనరు చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గృహ సారథులు.. జగనన్న రథ సారథులు

కాశినాయన : వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృ''హసారథులు జగనన్న రథ సారథులని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జగన్‌మోహన్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం మండలంలోని మిద్దెల సమీపంలో ఉన్న బీఎస్‌రెడ్డి పాఠశాల ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలుగుగంగ ఎడమ కాలువ నుంచి లిఫ్ట్ ద్వారా సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె, గంగన్నపల్లె, కోనరాజుపల్లె చెరువులకు నీరు అందించేందుకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల మండల కో ఆర్డినేటర్ హనుమంతరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు గురివిరెడ్డి, వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యానికి అధిక ప్రాధాన్యత


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం నరసాపురం నుంచి మూలపల్లెకు రూ.2.20 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నరసాపురంలో రూ.16 లక్షలతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీ పనులకు ఆయన భూమి పూజ చేసి ఆయన మాట్లాడారు. ఇప్పటికే అన్ని మారుమూల గ్రామాలకు తారురోడ్లు నిర్మించామని, అవసరమున్న చోట కూడా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. గంగన్నపల్లె నుంచి ఆకులనారాయణపల్లెకు తారురోడ్డు మంజూరైందని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచంద్రుడు, ఎంపీడీఓ ముజఫర్ రహీం, డీఈ నాగరాజు, కంట్రాక్టర్ చెన్నకృష్ణారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ


చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది

మైదుకూరు : మండలంలోని నంద్యాలంపేటలో మంగళవారం ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రాంతీయ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని మైదుకూరు మండలం నంద్యాలంపేట, మైలవరం మండలం వేపరాల, సింహాద్రిపురం మండలం సింహాద్రిపురం పంచాయతీలను ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రాంతీయ శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ మూడు పంచాయతీల నుంచి 60 మంది క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, రోడ్లపై ఉన్న చెత్త, రైతుల వద్ద నుంచి పేడను సేకరించడంపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రంలో న్యాడప్ తొట్లను, వర్మీ కంపోస్టు తయారీని సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తాం


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


డైరెక్టర్‌గా ఎన్నికైన గజ్జల కళావతికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

గడపగడపకు మన ప్రభుత్వం
కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రకాష్ నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మంగళవారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, ఎంపీటీసీ బాలాజీ నివాస్, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంభం వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీదేవి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలిగా గజ్జల కళావతి

స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని ది ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ అధ్యక్షురాలిగా గజ్జల కళావతిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం కోఆపరేటివ్ స్టోర్స్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎన్నికల్లో పార్టీ సీనియర్ నాయకురాలైన గజ్జల కళావతిని అధ్యక్షురాలిగా నియమించాలని నిర్ణయించామన్నారు. అలాగే టౌన్ బ్యాంకు కోఆప్షన్ సభ్యునిగా పార్టీ సీనియర్ నాయకుడు చెన్నకేశవరెడ్డిని ఎన్నుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి ప్రచారం

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న తనకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని వెన్నపూస రవీంద్రారెడ్డి అభ్యర్థించారు. మంగళవారం స్థానిక దస్తగిరిపేటలోని తఖ్వా పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తనని బలపరిచారని చెప్పారు. తనకు ప్రథమ ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్జల వెంకటేశ్వరరెడ్డి, దొంతు మురళి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్వీ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఐ మృతికి నివాళి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ఆర్ఐ సబ్దర్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అలాగే మున్సిపల్ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేడు ధార్మిక క్విజ్

కడప కల్చరల్: కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు నగరానికి చెందిన విద్యార్థులకు ధార్మిక క్విజ్ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి తెలిపారు. ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ధార్మిక కార్యక్రమాలను వినూత్న రీతిలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ధార్మిక క్విజ్, మధ్యాహ్నం 2 గంటలకు అదే తరగతులకు ధారణ (మెమొరీ) పోటీ ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు బుధవారం కూడా ఆలయ నిర్వాహకులను నేరుగా కలిసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఉపాధ్యాయుడు లేదా సహాయకుడితో కలిసి రావాలని, పాఠశాలయాజమాన్యం అనుమతి పత్రం అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

20న మోడల్ పరీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే పదో తరగతి మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి


గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, మున్సిపాలిటీ కన్వీనర్

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈవై యద్దారెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక భావనారాయణనగర్‌లో గుంతపల్లె, భావనారాయణనగర్ సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ గత ప్రభుత్వ హయాంలో అందుతున్న పథకాలు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుతున్న పథకాల మధ్య తేడాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. అలాగే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను, బురదజల్లే కార్యక్రమాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, కౌన్సిలర్ మహేష్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, సచివాలయ కన్వీనర్లు శివారెడ్డి, రవి, వెంకటసుబ్బయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ఎస్టీఎఫ్ పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎస్టీఎఫ్ పట్టణ నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : సకాలంలో జీతాలు చెల్లించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక అనబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్టీఎఫ్ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్టీఎఫ్ ప్రొద్దుటూరు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీఎఫ్ పట్టణ నూతన అధ్యక్షుడుగా వినోద్, గౌరవాధ్యక్షుడుగా హరిరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ చౌడయ్య, వై.రాధాలక్ష్మితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాల నమోదు తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రైవేటు యాజమాన్యాల్లో ఉన్న ఎల్‌జేకీ, యూకేజీ విద్యార్థుల నమోదును స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, ఏపీవో జ్వాలాపతి, బెటాలియన్ హెచ్ఎం భాస్కర్ సూచించారు. ఆర్‌జేడీ, డీఈఓల ఆదేశాల మేరకు మంగళవారం కడప మండల పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలలను సీఆర్‌పీల ఆధ్వర్యంలో సందర్శించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు శంకర్, కృష్ణ, చైతన్య ప్రిన్సిపాల్ షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

12న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఈనెల 12న నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశ కరపత్రాలను యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా ట్రెజరర్ నరసింహారావు పాల్గొన్నారు.

భాషా దినోత్సవాన్ని నిర్వహించాలి

కడప కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని తెలుగు భాషా వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కోటిరెడ్డిసర్కిల్ కూడలిలోని మొల్ల విగ్రహానికి ఆయన భాషా పరిరక్షణ కోసం వినతిపత్రమిచ్చారు.మాతృభాషను కాపాడుకోవాలని ప్రతి తెలుగువాడి ధర్మమని తెలిపారు.